

హలో.. మీ అబ్బాయి పెద్ద క్రైంలో ఇరుక్కున్నాడు

కొత్తరకం మోసాలకు తెరలేపిన సైబర్ నేరగాళ్లు

పోలీసు అధికారుల పేర్లతో మొబైల్ వాట్సాప్ కాల్స్

ఆందోళనతో మోసపోతున్న అమాయక తల్లిదండ్రులు

"హలో.. హలో.. రంగబాబు మీ అబ్బాయే కదా?"
"అవును సార్"
"బెంగళూరులో ఫలానా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగే కదా"
"..సార్..సార్.. అవును సార్ ఏమైంది సార్
'మీ అబ్బాయి ఫ్రెండ్స్‌తో కలిసి పెద్ద క్రైంలో ఇరుక్కున్నాడు. ఇప్పుడు మా అదుపులోనే ఉన్నాడు"
"అదేంది సార్.. మావాడు అట్లాంటి వాడు కాదు సార్.. మీరెవరు సార్"
"నేను బెంగళూరు ఏసీపీని"
"సార్.. నమస్తే సార్.. ప్లీజ్ సార్"
"మీవాడు ఇంకా ఇరుక్కోకముందే జాగ్రత్త పడండి"
"చెప్పండి సార్. ఏం చెయ్యమంటారు సార్"
మా ఇన్‌స్పెక్టర్ మాట్లాడతాడు వినండి అంటూ ఫోన్ ఇంకొకరికి ఇచ్చారు.
"సార్ బాగా సీరియస్‌గా తీసుకున్నారు కేసు. తొందరపడకపోతే మీ అబ్బాయి ఫ్యూచర్ స్పాయిల్ అయిపోతుంది"
"సార్.. నమస్తే.. దయతలవండి సార్"
"సార్‌ని ఎలాగోలా మేనేజ్ చేస్తాను. ఒక అకౌంట్ నెంబర్ ఇస్తాను. లేట్ చేయకుండా వెంటనే ఫోన్‌పేలో ముందు 50 వేలు వేసేయండి.. లేట్ చేస్తే ఆ తర్వాత మీ ఇష్టం"



ఫోన్ పెట్టేయడంతో ఆ తండ్రికి ముచ్చెమటలు పోశాయి. కొడుకు నెంబర్‌కి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. దాంతో ఇంట్లో అందరూ ఏడుపులకెత్తుకున్నారు. వాట్సాప్‌లో వచ్చిన కాల్ చూస్తే ఒక పోలీసు అధికారి ప్రొఫైల్ పిక్ ఉంది. అశోక్ జైన్, ఏసీపీ అని కూడా ఉంది.
కుటుంబం అంతా తల్లడిల్లిపోయింది. ఏమైందో ఏమో ముందు వాళ్ల అడిగిన డబ్బులు వేసేయండి అని ఇంట్లోవాళ్ల ఒత్తిడి మొదలైంది. ఇంతలో కొడుకు నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది.
"హలో నాన్నా మీ మిస్డ్ కాల్ చూసి చేస్తున్నా..చెప్పండి"
ఆ గొంతు వినగానే తండ్రికి ఏడుపు ఎగతన్నుకుని వచ్చింది.
"ఎక్కడున్నావు రా"
"రూం లోనే నాన్నా .. ఏం.. ఎందుకు?"
"హమ్మయ్య.. ఏం లేదులే.. జాగ్రత్త."

తిరుపతిలో శనివారం ఒక తండ్రికి వచ్చిన బెదిరింపు ఫోన్ ఇది. కాస్త తేరుకుని కాల్ వచ్చిన నెంబర్ చూస్తే +92 323 0268518 అని ఉంది. అది ఇండియా కోడ్ కాదు. పాకిస్తాన్ నెంబర్. క్షణంలో మోసపోయి ఉంటాం కదా అని ఆ కుటుంబం కలవరపడింది. ఇటువంటి ఫోన్లు వారం రోజులుగా తిరుపతి జిల్లాలో అనేక మందికి వస్తున్నాయి.ముఖ్యంగా బెంగళూరు, చెన్నయ్‌లలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే కుటుంబాలనే ప్రధానంగా వీరు ఎంచుకున్నట్టు తెలుస్తోంది. +92 308 5077575 నెంబరు నుంచి మరొకరికి ఇలాగే రింగ్ అయ్యింది. డ్రగ్స్ కేసులో ఇరుకున్నారని, రేప్ కేస్ అనీ, సైబర్ క్రైం అనీ ఇలా తల్లిదండ్రులు భయపడే కారణాలు చెప్పి డబ్బు గుంజే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతూ ఉన్నాయి. కొంతమంది మోసపోయి డబ్బులు కూడా కట్టేసినట్టు ప్రచారం అవుతోంది.కొందరికైతే వీడియో కాల్స్ కూడా చేస్తున్నారు. దర్జాగా కేబిన్‌లో పోలీసు అధికారి కూర్చుని ఫోన్‌లో మాట్లాడతారు. 'మా అబ్బాయితో ఒకసారి మాట్లాడించండి సార్' అని అడిగితే.. 'ఎంత ధైర్యం మీకు.. పోలీస్‌కస్టడీలో ఉన్నవాడితో మాట్లాడించాలా?' అని దబాయిస్తారు. ఇలా విదేశాల నుంచి సైబర్ నేరగాళ్లు తిరుపతిలోని దాదాపు 8 మందికి వారం రోజుల వ్యవధిలో వాట్సాప్ కాల్స్ చేసి పోలీసు అధికారులమంటూ డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలు తిరుపతిలోని సైబర్ పోలీసుల దృష్టికి వచ్చినట్లు సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ చెప్పారు. పోలీసు అధికారుల వున్న వాట్సాప్ పిక్ ఫోటోలతో ఎవ్వరూ ఫోన్ చేసి మాట్లాడరని, మోసపోవద్దని ఆయన తెలిపారు. ప్రధానంగా బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్,ఢిల్లీ, ముంబాయి ప్రాంతాల నుంచి మాత్రమే ఇలాంటి కాల్స్ వస్తున్నాయన్నారు.

- తిరుపతి (నేరవిభాగం)

సైబర్ నేరాల బారిన పడద్దు

అపరిచిత కాల్స్ తీయవద్దని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. అపరిచితులతో సోషల్ మీడియాలో స్నేహం చేయద్దంటున్నారు.ఫేస్‌బుక్ ప్రొఫైల్స్ లాక్ చేసి వుంచాలని సూచిస్తున్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదని, పేటీఎం, బ్యాంకు అకౌంటు వివరాలు చెప్పవద్దని, సిమ్ అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదంటున్నారు. బహుమతులు గెలుచుకున్నారనే వచ్చే ఈ మెయిల్స్ కూడా బోగస్ అని గుర్తించాలంటున్నారు. మీ నెట్ బ్యాంకింగ్‌కు లాగిన్ అవ్వాలని క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలు ఎంటర్ చేయమని అడిగితే తప్పకుండా అది మోసం అని గుర్తించండని హెచ్చరిస్తున్నారు.

1930 నెంబరుకి ఫోన్ చేయండి

ఇలాంటి నేరాలు అరికట్టేందుకు, బాధితులు పోగొట్టుకున్న మొత్తం సొమ్మును రాబట్టేందుకు పోలీసు శాఖ ఒక ఏర్పాటు చేసింది. 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే చాలు.. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా క్షణాల్లో ఆ సమాచారం సైబర్ పోలీసులకు అందుతుంది. మీరు కట్టేసిన డబ్బును ట్రాక్ చేసి తరువాత బ్లాక్ చేసి తిరిగి మీకు దక్కేలా చేస్తారు. దీంతో పాటు సైబర్ బాధితుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెయిల్ ఐడీకి ఫిర్యాదు చేయవచ్చు. **డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైం.జీవోవి.ఇన్‌**కు ఫిర్యాదు చేయవచ్చునని తిరుపతి జిల్లా సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. అవసరమైతే తన నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని ఆయన తెలిపారు. వినోద్ కుమార్ నెంబర్: 9154141884

గురుకులంలో కలకలం

- విద్యార్థిని కన్పించలేదని వెతుకులాట
- హాస్టల్ గదిలోనే వున్నట్లు గుర్తింపు

సూళ్లూరుపేట, జూలై 22 : ఓ విద్యార్థిని అదృశ్యమై కొద్ది గంటలకే నిద్రిస్తూ కనిపించిన వైనం కలకలం రేపింది. సూళ్లూరుపేటలోని అంబేడ్కర్ గురుకులంలో పదో తరగతి విద్యార్థిని అదృశమైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురు ప్రసూన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 8 గంటలకు సదరు విద్యార్థిని క్లాసు ప్రారంభంలో కనిపించింది. 10.50గంటలకు విరామ సమయంలో వెళ్లిన విద్యార్థిని 11 గంటలకు తరగతి గదిలో కనిపించలేదు. సిబ్బంది ప్రిన్సిపాల్‌కు చెప్పడంతో పాఠశాలలో విస్తృతంగా గాలించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక స్వగ్రామంలోని తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థులెవరూ బయటకు వెళ్లలేదని గేట్ వాచ్‌మన్ పోలీసులకు చెప్పాడు. అనుమానంతో హాస్టల్ గదులను పరిశీలించారు. ఆ విద్యార్థిని ఓ గదిలో నిద్రిస్తున్నట్లు గుర్తించారు. బాలికను విచారించారు. సాంఘిక సంక్షేమ గురుకుల డీసీవో పద్మజ రాత్రి పాఠశాలను తనిఖీ చేశారు.



విలువైన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం

లేఅవుట్ సిద్ధం చేస్తున్న వైసీపీ కార్యకర్తలు

పట్టించుకోని అధికార యంత్రాంగం

చెరువును చెరబట్టి లేఅవుట్లు

నాయుడుపేట, జూలై 22 : అధికారం అడ్డం పెట్టుకుని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ వారు సాగించిన అక్రమాలకు అంతూపొంతూ లేకుండా పోయింది. తాజాగా ఓ చెరువు భూమిని సైతం ఆక్రమించేసి లేఅవుట్‌కు సిద్ధం చేసిన వైనమే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. వివరాలివి... నాయుడుపేట మండలంలో మేనకూరు సెజ్ వల్ల అనేక భారీ, మధ్యతరహా, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అందులో వేలాది మందికి ఉపాధి దొరికింది. ఫలితంగా ఈ ప్రాంతంలో భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఎకరా కోట్లాది రూపాయల విలువ పలుకుతోంది. దీంతో ధనదాహం మరిగిన వైసీపీ కార్యకర్తలు ఇక్కడి భూమిపై కన్నేశారు. మేనకూరు పంచాయతీలోని వద్దిగుంట కండ్రిగ నాయుడుపేట - వెంకటగిరి రహదారి వద్ద చిన్న చెరువుకు సంబంధించి సర్వే నెం.189లో 1.80 ఎకరాల చెరువు భూమి ఉంది. ఈ చెరువులో దాదాపు 65-70 సెంట్లలో వైసీపీ కార్యకర్తలు మట్టితోలి చదును చేశారు. పక్కనే ఉన్న దాదాపు 3.5 ఎకరాల పట్టాభూమితోపాటు చెరువుభూమిని కలిపి లేఅవుట్ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. దీనిపై ఆంధ్రజ్యోతి ఇరిగేషన్ ఏఈ వీరాస్వామిని వివరణ కోరగా... తమ శాఖకు ఇచ్చిన జాబితాలో వద్దిగుంటకండ్రిగకు చెందిన చిన్నచెరువు లేదన్నారు. అయినప్పటికీ సర్వే చేయించి ఆక్రమణపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ కల్యాణి వివరణ కోరగా... వద్దిగుంట కండ్రిగ చిన్న చెరువు ఆక్రమణ, అక్రమ లేఅవుట్‌పై పంచాయతీ వీఆర్వోను పంపిస్తానని తెలిపారు.


చదునుచేసి మట్టితోలిన చిన్నచెరువు

పరిహారమా.. పరిహాసమా?

- మార్చిలో బటన్ నొక్కినా జమకాని ఇన్‌పుట్ సబ్సిడీ
- ఎన్నికల ముందు కోడ్ పేరిట జగన్ నాటకం
- ఇప్పటికీ అందని తుపాను నష్ట పరిహారం
- కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న రైతులు

గూడూరు అర్బన్, జూలై 22: ఎటు చూసినా కూలిన చెట్లు... మునిగిన పైర్లు... నేలంతా నీరు... కర్షకుల కంట కన్నీరు...గతేడాది డిసెంబరులో ప్రకృతి ప్రకోపించి మిచాంగ్ తుపాను రూపంలో చేసిన బీభత్సానికి ఊళ్లకు ఊళ్లే చిగురుటాకుల్లా వణికిపోయాయి. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో 5168 మంది రైతులకు చెందిన 1423.38 హెక్టార్లలోని పంట 33శాతం కంటే ఎక్కువగా దెబ్బతింది. నిమ్మ, మామిడి, మిరప, అరటి, కూరగాయలు, తమలపాకులు తదితర పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. రూ. 319.63 కోట్ల మేర నష్టపరిహారం, పెట్టుబడి రాయితీ కింద అందాల్సి ఉందని అప్పట్లో లెక్కతేల్చారు.


తుపానుతో దెబ్బతిన్న అరటిపంట(ఫైల్‌ఫొటో)

మార్చిలో బటన్ డ్రామా..

ఈ ఏడాది మార్చి 6న నాటి సీఎం జగన్ బటన్ నొక్కి రాష్ట్రంలో 11,59,126 మంది తుపాను బాధిత రైతులకు రూ.1294 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశామన్నారు. అంతకు ముందు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కరువు నష్టపరిహారం కూడా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అకౌంట్‌లో డబ్బులు పడ్డాయేమోనని రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. జమ కాలేదని తెలుసుకుని విస్తుపోయారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఖాతాల్లో డబ్బులు జమ చేయనీయకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయంటూ సానుభూతి లబ్ధి కోసం జగన్ పాకులాడారు. కోడ్ అమలులో ఉన్నా పోలింగ్ ముందు రోజు రైతుల డబ్బులు వేస్తున్నట్లు నమ్మించారు. నష్టపరిహారం-పెట్టుబడి రాయితీ జమ చేయకుండానే చేతులెత్తేసి జగన్ కుర్చీ దిగిపోయారని రైతులు గ్రహించారు. ఆయన హయంలో సూక్ష్మ సేద్యం, సబ్సిడీ యంత్ర పరికరాలు, విత్తనాలు, మందులు, ఎరువులు తదితర ప్రోత్సాహక పథకాలకు కూడా మంగళం పాడేశారు. క్లిష్ట సమయాల్లో కూడా తమను ఆదుకోలేదని,మోసం చేశారని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో పెట్టుబడి రాయితీ, నష్టపరిహారం అందజేస్తుందని వీరంతా ఎదురుచూస్తున్నారు.


రాళ్లకుప్పంలో ఘర్షణ పడుతున్న గ్రామస్తులు

రాళ్లకుప్పంలో ఇరువర్గాల ఘర్షణ

12మంది గ్రామస్తులపై కేసులు

సత్యవేడు, జూలై 22 : సత్యవేడు మండలం రాళ్లకుప్పంలో సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీనిపై విచారించిన పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేశారు. ఇరు వర్గాల కథనం మేరకు....రాళ్లకుప్పంలో ఇటీవల జరిగిన జాతరలో పోలేరమ్మ ఊరేగింపు సందర్భంగా చిన్న పాటి వివాదం మొదలైంది. గ్రామానికి చెందిన రమేష్ స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో ఇటీవల ఇల్లు కట్టుకున్నాడు. పోలేరమ్మ ఊరేగింపు సందర్భంగా తమ ఇంటివరకూ తీసుకు రావాలని రమేష్ కోరారు. అయితే రమేష్ ఇల్లు గ్రామ పొలిమేరకు అవతల ఉందని, కాబట్టి పోలేరమ్మను ఇంటివరకు తీసుకురావడం కుదరదని జాతర నిర్వాహకులు చెప్పారు. దీంతో వివాదం చిలికి చిలికి గాలి వానలా మారింది. పెద్దలు జోక్యం చేసుకోవడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. అయితే పూర్తిగా సమసిపోకుండా వివాదాలకు ఆజ్యం పోస్తూ తరచూ గ్రామంలో గొడవలు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం రమేష్, దామోదరం మధ్య ఘర్షణలు జరిగాయి. విషయం తెలుసుకున్న శ్రీసిటీ పోలీసులు గ్రామానికి చేకురుని రెండు వర్గాలను శాంతింపజేశారు.మళ్లీ సోమవారం ఉదయం గ్రామంలో ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఇరువర్గాలూ బాహాబాహీకి దిగడంతో గ్రామంలో భయానక వాతావరం నెలకొంది.ఇరువర్గాలూ కత్తులు, కర్రలతో స్వైరవిహారం చేయడంతో మహిళలు , పిల్లలు భయంతో వణికిపోయారు. ఈ ఘర్షణలో ఇరు వర్గాలకూ చెందిన పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న శ్రీసిటీ సీఐ భాస్కర్, ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇరువర్గాలనూ పోలీస్ స్టేషన్‌కు తరలించి ఘర్షణలను అదుపులోకి తీసుకొచ్చారు.ఇరువర్గాలకు చెందిన రమేష్, శేఖర్ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఘర్షణలకు కారణమైన 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.శ్రీసిటీ డీఎస్పీ సైడేశ్వర్రావు ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

లోయలో పడ్డ లారీ

క్లీనర్ మృతి, డ్రైవర్ పరిస్థితి విషమం

లారీ ఢీకొనడంతో లోయలోకి జారిపోయిన లగేజీ ఆటో, కారు

చంద్రగిరి, జూలై 22 : భాకరాపేట ఘాట్ రోడ్డులో ఓ లారీ అదుపు తప్పి ముందు వెళుతున్న లగేజీ ఆటోను, కారును ఢీ కొని 20 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, లగేజీ ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.... మధ్యప్రదేశ్ నుంచి ముగ్గు పిండి లోడుతో ఓ లారీ తిరుపతికి వస్తుండగా, మార్గమధ్యంలోని భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే లారీ అదుపు తప్పింది. ముందు వెళుతున్న టమోటా లగేజీ ఆటోను, ఓ కారును ఢీ కొని 20 అడుగుల లోయలోకి బోల్తా పడింది. కారు 30అడుగుల లోయలో పడింది. ఈ ప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు కాగా, అందులోని క్లీనర్ అల్తాఫ్(30) అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ అబ్బులేకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ధర్మవరానికి చెందిన బాలమురళీకృష్ణతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.లగేజీ ఆటోలో వస్తున్న భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీ కింద పడి మృతి చెందిన క్లీనర్ అల్తాఫ్‌ను బయటకు తీశారు. మృతుడు మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


లోయలో పడి నుజ్జునుజ్జయిన లారీ



లోయలో దెబ్బతిన్న కారు, లగేజీ ఆటో

తిరుపతిలో డీజీపీ



తిరుపతి(నేరవిభాగం), జూలై 22: డీజీపీ ద్వారకా తిరుమల రావు తిరుపతి వచ్చారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనపై విచారణ నిమిత్తం వచ్చిన ఆయన అక్కడినుంచి సోమవారం రాత్రి కారులో బయలుదేరి తిరుపతికి చేరుకున్నారు. పోలీసు అతిథి గృహంలో బస చేశారు.

బీటెక్ డ్యూయెల్ డిగ్రీ కౌన్సెలింగ్ నేడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22: పద్మావతి యూనివర్సిటీలో బీటెక్ డ్యూయెల్ డిగ్రీ కోర్సులో ప్రవేశానికి కౌన్సెలింగ్ నేడు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సావేరి హాల్లో కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు మూడేళ్ళు పద్మావతి యూనివర్సిటీలోనూ, చివరి ఏడాది స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోనూ చదువుకునే అవకాశం కలుగుతుంది. ఇంటర్‌లో 70 శాతం మార్కులు కలిగి ఆసక్తి ఉన్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చు. సమగ్ర సమాచారం కోసం.. 79959 73878 నెంబరులో సంప్రదించవచ్చని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని సూచించారు.

బంగారు తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జూలై 22: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారిని తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానీపై చెవిరెడ్డి విమర్శలు అర్థరహితం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, జూలై 22: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీపై చెవిరెడ్డి భాస్కరరెడ్డి చేస్తున్న అర్థరహిత విమర్శలు, నిరాధార ఆరోపణలు మానుకోవాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ అన్నారు. చిన్న గొట్టిగల్లులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాని ఏనాడూ దౌర్జన్యాలు, అవినీతిని ప్రోత్సహించలేదన్నారు. మహిళా విశ్వవిద్యాలయంలో జరిగిన దాడిలో మోహిత్ రెడ్డి పాత్ర రుజువు కావడంతో అరెస్టు చేస్తారేమోనన్న ఫ్రస్టేషన్‌లో చెవిరెడ్డి ఉన్నారని, ఈ దాడిని ప్రజలందరూ చూశారన్నారు. వ్యక్తిగత కారణాలతో వైసీపీ వారిపై దాడులు జరిగితే వాటిని టీడీపీపైకి నెట్టడం సబబు కాదన్నారు. పెద్దిరెడ్డికి, చెవిరెడ్డికి రాజకీయ విభేదాలు ఉంటే వారి పార్టీలోనే తేల్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, కార్యదర్శి మదనమోహన, ఆర్వీ రమణారెడ్డి, మోహన రెడ్డి, మునస్వామి నాయుడు, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, రమేశ్ రెడ్డి, శేఖరగౌడ్, గురుమూర్తి, మల్లిఖార్జునరెడ్డి, మౌలాలి, మధుసూదనరెడ్డి, శ్రీధర్ రాయల్, రాజగోపాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో కొనసాగుతున్న పోలీసుల పహారా



పాకాల, జూలై 22: పాకాలలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఆదివారం ఘర్షణ జరగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనలో ఇరువర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో, ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి విచారించినట్లు సీఐ శ్రీరాములు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ సంఖ్యలో పురవీధుల్లో పహారా కాస్తున్నారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ముగిసిన ఉరుసు



పీకలతో హోరెత్తిస్తున్న ఆకతాయిలు

పాకాల, జూలై 22: పాకాలలో హజరత్ షేక్ ఫరీద్ మస్తాన్ ఔలియా దర్గావద్ద రెండు రోజుల పాటు నిర్వహించిన ఉరుసు సోమవారం రాత్రి ముగిసింది. ఖవ్వాలి గాయకులు నిర్వహించిన పాట కచేరి ఆకట్టుకుంది.ఉరుసులో సోమవారం రాత్రి ఆకతాయిల అల్లర్లు శృతిమించాయి. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు ఉరుసు తిలకించడానికి, దుకాణాలలో వస్తువుల కొనుగోలుకు రాత్రి భారీ సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా ఆకతాయిలు గుంపులు గుంపులుగా పీకలతో హోరెత్తిస్తూ పోలీస్ స్టేషన్ సమీపంలోని దర్గావద్ద నుంచి రైల్వే స్టేషన్ ఎదుట మూడు రోడ్ల కూడలి వరకు తిరుగుతూ గందరగోళం సృష్టించారు. చెవులు చిల్లులు పడేలా పీకలు ఊదుతూ ఇబ్బందిపెట్టారు.

బాధితులకు చెవిరెడ్డి పరామర్శ

చంద్రగిరి, జూలై 22: చంద్రగిరి మండలం, అగరాల జగనన్న కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు చంద్రమ్మ ఇంటిని కూల్చివేశారు. దీంతో సోమవారం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి బాధితులను పరామర్శించారు. సర్పంచ్ భాస్కరరెడ్డి, వైసీపీ నాయకుడు దేవరాజులురెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులకు....

పాకాల: మండలంలో ఆదివారం జరిగిన ఘర్షణలో గాయపడిన వైసీపీ నాయకులను సోమవారం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పరామర్శించారు. పంటపల్లెలో కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం పాకాలలో ధ్వంసమైన బట్టల దుకాణాన్ని పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దాడులకు పాల్పడినవారిని అరెస్ట్ చేయాలని సీఐ శ్రీరాములుని కోరారు.

చెవిరెడ్డి పెట్టించిన కేసులతో కోర్టు చుట్టూ తిరుగుతున్నాం

తిరుపతి అర్బన్, జూలై 22: వైసీపీ హయాంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తమపై పెట్టించిన అక్రమ కేసులతో ఇప్పటికీ కోర్టు చుట్టూ తిరుగుతున్నామని టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కేసుల గురించి చెవిరెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టలేదని చెప్పడం అవివేకమన్నారు. ఓడినప్పుడే హుందాగా వ్యవహరించాలని సూచించారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయనీయకుండా పదేపదే ఎమ్మెల్యే నానీని రెచ్చగొట్టే ప్రెస్‌మీట్లు పెడుతుండటం తగదన్నారు. ఇక ప్రెస్‌మీట్లకు పరిసమాప్తం చెబుదామని ఎమ్మెల్యే సతీమణి సుధారెడ్డి మీడియా సమక్షంలో చెప్పారని గుర్తుచేశారు. అయినా పట్టించుకోకుండా చెవిరెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టడం, స్విమ్స్ ఆస్పత్రి రిపోర్టును మీడియాకు పంపడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అన్నింటికి స్వస్తిపలికి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.చంద్రగిరి శ్రేయస్సుకోరి మా ఎమ్మెల్యేను సంధికైనా ఒప్పిస్తామన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదరాజ మఠాధిపతి సుజయనిధి తీర్థ స్వామి సోమవారం పెద్దమర్యాదతో తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.అలాగే హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా, సినీనటుడు రాంప్రసాద్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

వేమూరులో నెదర్లాండ్ శాస్త్రవేత్త

తిరుచానూరు, జూలై 22: తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పొలాల్లో నెదర్లాండ్ శాస్త్రవేత్త మిథాలీ పోవయ్య సోమవారం పర్యటించారు.ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్, పీఎండీఎస్, మల్చింగ్ లైవ్ మల్చింగ్, కషాయాలను అడిగి తెలుసుకున్నారు.

పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22: ఎస్వీయూనివర్సిటీ పరిధిలో పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలను ఇన్‌చార్జి వీసీ అప్పారావు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.

గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

తిరుపతి(ఆటోనగర్), జూలై 22: గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి విద్యుత్ లైన్ల పునరుద్ధరీకరణ పనులు చేస్తున్నామని సదరన్ డిస్కం ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్ అన్నారు. తిరుపతి విద్యుత్ రూరల్ డివిజన్ దామలచెరువు 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పిపిబైలు 11కేవీ ఫీడర్‌ను సోమవారం పరసానిపల్లి వద్ద తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి లైన్లు పటిష్ఠం చేయడానికి ఈ తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాణాల విభాగం ఈఈ దామోదరం సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఈఈ కార్యాలయంలో విద్యుత్ అదాలత్

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి బుధవారం స్థానిక పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ ఈఈ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తామని టౌన్ డివిజన్ ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి ఆధార్ నమోదు

రామచంద్రాపురం, జూలై 22: మండలంలో ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. 23వ తేదీ గంగిరెడ్డిపల్లి, మిట్టకండ్రిగ, 24న శ్రీరామపురం, కుప్పంబాదూరు, 25న నడవలూరు, సీకే పల్లి, 26న సొరకాయలపాళెం, నెత్తకుప్పం, 27న కేకేవీపురం, అనుపల్లి గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేస్తాయన్నారు. 0-5పిల్లలకు ఉచితంగా నమోదుచేస్తారన్నారు. మిగతా సేవలకు రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

హోదాకోసం కేంద్రాన్ని డిమాండ్ చేయాలి

సీపీఐ నేత ఓబులేసు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు

తిరుపతి(ఆటోనగర్), జూలై 22: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి చర్చించి సాధించడానికి కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు డిమాండ్ చేశారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ జిల్లా సర్వ సభ్యసమావేశం జరిగింది. ఈసమావేశంలో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ దేశ ప్రజలు తిరస్కరించిన ప్రధానిగా నరేంద్ర మోదీ ఉన్నారని చెప్పారు. అధికారాన్ని వదలకుండా సంకీర్ణ ప్రభుత్వం నడుపుతున్నారు. ప్రతిపక్ష నాయకులను జైళ్లకు పంపి, ప్రజాస్వామ్యానికి పాతరేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సంకీర్ణ ప్రభుత్వం వున్న సమయంలోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించుకోవాల్సిన అవసరం వుందని ఆయన చెప్పారు. ఈ తరుణంలో రాష్ట్రంనుంచి ప్రతిపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్ళి చర్చించి ప్రత్యేక హోదా సాధించాలని ఆయన సూచించారు. జగన్ చేసిన పాలనలాగా కూటమి ప్రభుత్వం అనుసరిస్తే అందుకు తగిన విధంగా ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. నాయకులు పి.హరినాథ్ రెడ్డి, ఎ.రామానాయుడు, పి.మురళి, జె.విశ్వనాథ్, పెంచలయ్య, ఎన్.డి.రవి, జె.రామచంద్ర, కె.రాధాకృష్ణ ప్రసంగించారు.

విశిష్టమైన వ్యక్తి జస్టిస్ చంద్రచూడ్



జస్టిస్ వైవీ చంద్రచూడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22: భారత న్యాయ వ్యవస్థ చరిత్రలో జస్టిస్ వైవీ చంద్రచూడ్ విశిష్టమైన వ్యక్తి అని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. లా విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జస్టిస్ చంద్రచూడ్ స్మారక కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. న్యాయ నిపుణుడైన చంద్రచూడ్ ఈ తరం న్యాయ రంగానికి స్ఫూర్తిదాయకమన్నారు. సుదీర్ఘ కాలం సీజేఐగా పని చేసి రికార్డు సృష్టించారన్నారు. చంద్రచూడ్ ఇచ్చిన తీర్పులు న్యాయ వ్యవస్థ గౌరవాన్ని పెంచాయన్నారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. దేశ న్యాయ వ్యవస్థపై జస్టిస్ చంద్రచూడ్ బలమైన ముద్ర వేశారని కొనియాడారు. ప్రిన్సిపాల్ పద్మనాభం, డీన్ కృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే చెవిరెడ్డి ఒంగోలుకు పారిపోయాడు

- టీడీపీ నాయకుల విమర్శ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 22: ఎన్నికల ముందు సొంత సర్వేలో ఓడిపోతారని తెలుసుకుని చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఒంగోలుకు పారిపోయాడని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చెవిరెడ్డి ఓటమిని పసిగట్టి చంద్రగిరి నియోజకవర్గంలో మోహిత్‌రెడ్డిని నిలబెట్టి బలిపశువును చేశారన్నారు. మోహిత్‌రెడ్డిని అరెస్టుచేస్తారనే భయంతో పాటు సమస్యలను పక్కదోవ పట్టించడానికి నానీపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాని వైసీపీతో అంటకాగాడని విమర్శిస్తున్న ఆయన టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ఎంపీ శివప్రసాద్, బొజ్జల గోపాలకృష్ణారెడ్డితో ఎన్ని పనులు చేయించుకున్నారో అందరికీ తెలుసన్నారు. నానీకి సహాయపడ్డానని చెబుతున్న భాస్కర్‌రెడ్డి.. నీ పార్టీకి ద్రోహం చేసినట్లు కాదా... అపుడు జగన్‌కు చెప్పకపోవడం వల్ల నిన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు జనార్థన్ చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, సురేంద్ర నాయుడు, రామిరెడ్డి, వేదాంతరెడ్డి, చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు మూడు రోజుల జైలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 22: అతిగా మద్యం సేవించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించిన ఆటో డ్రైవర్‌కు మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. రెండు రోజులుగా నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ అనలైజర్ల ద్వారా తనిఖీ చేశారు. ఇందులో 19 మంది మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు ట్రాఫిక్ పోలీసులు గుర్తించి, నోటీసులు అందచేశారు. ఒక్కొక్కరికీ రూ.10,000 లెక్కన రూ.1,90,000 అపరాధం విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.ఎక్కడైనా మైనర్ వ్యక్తులు వాహనాలు నడిపి పట్టుబడితే మాత్రం సంబంధిత వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామని డీఎస్పీ రమణకుమార్ హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 22: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 101 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, మహిళల సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, విమలకుమారి పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో డిప్లొమా కోర్సులకు దరకాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యం), జూలై 22: ఎస్వీ వైద్య కళాశాలలో రెండు సంవత్సరాల కాలవ్యవధి పారా మెడికల్(అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్) కోర్సులకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. కళాశాలలో డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ 30 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ 30 సీట్లు మొత్తం 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన విద్యార్థులు ఈ సీట్లకు దరకాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులకు సంబంధించి ఏపీ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఎంపికలు జరుగుతాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఆగస్టు 6 తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరకాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. కళాశాలలోని పారా మెడికల్ విభాగంలో రూ.100 చెల్లించి విద్యార్థుల వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను లేదా 9440879943 నంబరును సంప్రదించగలరని ఆయన తెలిపారు.

ఇన్‌చార్జి వీసీలకు సత్కారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22: ఎస్వీయూ పూర్వ విద్యార్థులు రాష్ట్రంలోని ప్రముఖ యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలుగా నియమితులు కావడం యూనివర్సిటీకి ఎంతో గర్వకారణమని ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేంద్రబాబు పేర్కొన్నారు. ఇటీవల వర్సిటీ ఇన్‌చార్జి వీసీలుగా నియమితులైన అప్పారావు (ఎస్వీయూ), దొరస్వామి (ద్రవిడ వర్సిటీ), విజయభాస్కరరావు (వీఎస్‌యూ), ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు సోమవారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిని శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం యూనివర్సిటీతోనూ, సెంట్రల్ లైబ్రరీతోనూ తమకున్న అనుబంధాన్ని ఆయా వర్సిటీల అధికారులు జ్ఞాపకం చేసుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీచర్ వైద్యానికి ఆర్థిక సాయం చేయండి : ఎస్టీయూ



కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసిన ఎస్టీయూ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22: జిల్లా ఎస్టీయూ నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల విధుల్లో తీవ్ర అస్వస్థతకు గురైన బుచ్చినాయుడుకండ్రిగ మండలం చిన్నాయగుంటకు చెందిన సుమన్‌రావు అనే ఉపాధ్యాయుడి వైద్యానికి అధిక మొత్తంలో వైద్య ఖర్చయిందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయనకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ నాయకులు గాజుల నాగేశ్వరరావు, ధనంజయ నాయుడు, రమేష్, జగన్నాథం, కటారి మోహన్‌రెడ్డి, దేవేంద్ర, రామాంజనేయులు, గురుప్రసాద్, వేణు, వాసు, రేణుకాదేవి, దాక్షాయణి, రమాదేవి, మునికృష్ణ, మురళీకృష్ణ, గుమ్మడి మురళి, మునిశేఖర్, హరిబాబు, మధుసూదన్, రమేష్‌నాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆయుధాలు తీసుకోండి : ఎస్పీకి టీడీపీ విజ్ఞప్తి

తిరుపతి(నేరవిభాగం), జూలై 22: తిరుపతి నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు కొందరు తీసుకున్న ఆయుధాలను వెనక్కు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు ఎస్పీకి టీడీపీ నగర అధ్యక్షుడు పట్టికుంట శంకరనారాయణ వినతిపత్రం సమర్పించారు. వైసీపీ నాయకులు కొందరు ఎమ్మెల్యేల ఆదేశాలతో బలవంతంగా అధికారులను బెదిరించి గన్ లైసెన్సులు తీసుకున్నారన్నారు. అర్హత లేకుండా, అవసరం లేకున్నా రాజకీయ ప్రాబల్యంతో రౌడీయిజం, గూండాయిజం సాగించడం కోసం ఆయుధాలు వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బిచ్చగాడి మృతి



తిరుపతి(నేరవిభాగం), జూలై 22: తిరుపతి - కపిలతీర్థం రోడ్డులోని ఓ హోటల్ వద్ద 40 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని బిచ్చగాడు మృతి చెందాడు. గత కొద్ది రోజులుగా కపిలతీర్థం చుట్టుపక్కల భిక్షం ఎత్తుకుని జీవించే వాడని స్థానికులు చెప్పినట్లు అలిపిరి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఇతడి వివరాలు తెలిసిన వారు ఎస్ఐ 91541 41868కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. శవాన్ని ఫ్రీజరు బాక్సులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

పౌర చైతన్య వేదిక నూతన కార్యవర్గం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22: పౌర చైతన్య వేదిక నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పరమేశ్వరయ్య, వాకా ప్రసాద్ నియమితులయ్యారు. గౌరవాధ్యక్షుడిగా రాఘవశర్మ, ఉపాధ్యక్షులుగా తమటం రామచంద్రారెడ్డి, జె.రమేష్‌బాబు, ముషీర్ అహ్మద్, ప్రొఫెసర్ కాటూరి శారద, కార్యవర్గ సభ్యులుగా ప్రతాప్‌సింగ్, షరీఫ్, ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, కోశాధికారిగా హరీష్, సభ్యులుగా సెల్వరాజ్, గోపీ, ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. పౌర చైతన్యం కోసం పని చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది.

టీటీడీ కాలేజీల్లో సీట్లు పెంచండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22: టీటీడీ కాలేజీల్లో సీట్లు పెంచాలని ఈవో శ్యామలరావుకు ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ సోమవారం విన్నవించారు. జిల్లా, సమీప జిల్లాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో టీటీడీ కాలేజీల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకుంటున్నారనీ, డిమాండుకు తగినన్ని సీట్లు లేవన్నారు.

స్విమ్స్ పరీక్షలనే తప్పుబడతారా : వైసీపీ

తిరుపతి అర్బన్, జూలై 22: ఎమ్మెల్యే నానీకి సంబంధించి స్విమ్స్ ఆస్పత్రి ఇచ్చిన వైద్యపరీక్షలను తప్పుబట్టడం సరికాదని వైఎస్సీపీ నేత చెంచుమోహన్‌యాదవ్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసుపై ముందస్తు బెయిల్‌కు పోవడంలో తప్పులేదన్నారు.



నృత్య ప్రదర్శన - శ్రీమతి కల్యాణం పద్య నాటకం,నాలోన నీవే సాంఘిక నాటికల్లో దృశ్యాలు - నాట్యాచార్యులు ప్రసన్నరెడ్డికి సత్కారం

అలరించిన 'శ్రీమతి కల్యాణం'

తిరుపతి (కల్చరల్), జూలై 22: తిరుపతికి చెందిన అభినయ ఆర్ట్స్ వారి 24వ వార్షికోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, కొత్త ఢిల్లీ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ, అమరావతి, టీటీడీ సంయుక్త నిర్వహణలో హనుమ అవార్డ్స్ పోటీలలో భాగంగా మూడవ రోజు సోమవారం స్థానిక మహతి వేదికలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నృత్యపోటీలు నిర్వహించారు. అనంతరం హైదరాబాదుకు చెందిన ప్రముఖ కళాకారిణి నాట్యాచార్యులు ప్రసన్నరెడ్డిని పరిషత్ తరపున ఘనంగా సత్కరించారు. కాగా మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీవాసవి కళాపరిషత్, ఖమ్మం వారి శ్రీమతి కల్యాణం పద్య నాటకం ప్రదర్శించగా, సాయంత్రం 7 గంటలకు అభ్యుదయ ఆర్ట్స్ విజయవాడ వారి నాలోన నీవే సాంఘిక నాటికను ప్రదర్శించారు.

నేటి కార్యక్రమాలు: నేడు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నృత్యపోటీలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు ఖమ్మం కల్చరల్ అసోసియేషన్ వారిచే బ్రహ్మర్షి విశ్వామిత్ర పద్య నాటకం ఉంటుంది. సాయంత్రం 6.30 గంటలకు నటరాజ డ్రమటిక్ అసోషియేషన్, పెందుర్తి, విశాఖ జిల్లా కళాకారులు శిథిలజీవి సాంఘిక నాటిక, రాత్రి 7.45 గంటలకు గుంటూరుకు చెందిన ఆరాధన ఆర్ట్స్ అకాడెమీ వారు క్షేత్రం సాంఘిక నాటిక ప్రదర్శిస్తారు.

చంద్రబాబును కలిసిన సుగుణమ్మ



తిరుపతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే, తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి సుగుణమ్మ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివరించారు. సోమవారం అసెంబ్లీ విరామ సమయంలో ఆయనను కలిశారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటినుంచి తిరుపతిలో టీడీపీ చేపట్టిన కార్యక్రమాలను నివేదించారు. నామినేటెడ్ పదవిపై కూడా చర్చించినట్లు తెలిసింది. అదేవిధంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలో త్వరలో ప్రారంభం కానున్న అన్నా క్యాంటీన్ల, కొత్తగా ఏర్పాటుచేయనున్న మరికొన్ని క్యాంటీన్ల గురించి, సభ్యత్వ నమోదుగురించి చర్చించారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



రామచంద్రాపురం, జూలై 22: పరమాల మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం ద్రౌపదీ సమేత ధర్మరాజుల కల్యాణం వైభవంగా జరిగింది. మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. ఉభయకర్తలుగా పరమాల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శాంతకుమారి, పీఈటీ దేవరాజులు వ్యవహరించారు. మధ్యాహ్నం ద్రౌపదీ కల్యాణం హరికథను భాగవతారిణి సుమతి శ్రావ్యంగా వినిపించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త రమేష్ నాయుడు, సురేంద్ర నాయుడు, జయరామిరెడ్డి, దుర్వాసులు, చంద్రారెడ్డి, రోశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌కు సత్కారం



తిరుపతిరూరల్, జూలై 22: ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా నియమితులైన ప్రొఫెసర్ భూపతి నాయుడిని అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. అలాగే బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(రిమ్స్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. ఎంబీఏ హెడ్ డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు రిజిస్ట్రార్ భూపతి నాయుడిని ఘనంగా సన్మానించారు.కాగా ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావును, రిజిస్ట్రార్ భూపతి నాయుడిని డిగ్రీ కాలేజీ అధ్యాపకుల సంఘం సోమవారం అభినందించింది. రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు, జిల్లా అధ్యక్షుడు నరసింహవర్మ, జిల్లా కార్యదర్శి సుజన, సలహాదారులు డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ భాస్కరరాజు తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



తిరుపతి(విద్య), జూలై 22: తంబువానిగుంట నగరపాలక ప్రాథమిక పాఠశాలలో చదివి ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి ఎంపికైన పూర్వవిద్యార్థి ఎ.రెడ్డి జయవర్ధన్‌కి సోమవారం ఆస్కూల్ టీచర్లు తమవంతుగా రూ.12వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. డీవైఈవో కె.బాలాజి నేతృత్వంలో పాఠశాలలో నిర్వహించిన అభినందనసభలో విద్యార్థితోపాటు ఆయన తల్లిని అభినందించి ఈ నగదు అందించారు. హెచ్‌ఎం కె.రఘునాథ మాట్లాడుతూ జయవర్ధన్ ఉన్నతవిద్య కోసం టీచర్లందరూ కలసి ఈ నగదు అందించామని తెలిపారు. టీచర్లు కె.మంజుల, జి.పద్మజ, పి.సరోజిని, ఎస్.శ్రీరమాదేవి, రిటైర్డ్ టీచర్ స్వర్ణకుమారి, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం సుభాషిణి పాల్గొన్నారు.

నేటి నుంచి ఈఏపీసెట్ రెండోవిడత కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), జూలై 22: ఇంజనీరింగ్ కళాశాలల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈఏపీసెట్ రెండోవిడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. కేటీరోడ్డులోని ఎస్వీప్రభుత్వ పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రంలో ఈనెల 23 నుంచి 25వరకు మూడురోజులపాటు ఈ కౌన్సెలింగ్ జరగనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. ఈఏపీసెట్‌లో అర్హత సాధించి తొలివిడత కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు ఈనెల25లోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, కౌన్సెలింగ్‌కి హాజరుకావచ్చని, కాగా తొలివిడతలో రిజిస్ట్రేషన్ చేసుకుని కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులకు కూడా కళాశాలల, బ్రాంచ్‌ల మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా వచ్చి హెల్ప్‌లైన్ కేంద్రంలో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే విద్యార్థులు ఈనెల 24నుంచి 27వరకు ఆప్షన్స్‌ని నమోదు చేసుకోవాలని, ఈనెల 30న సీట్ అలాట్‌మెంట్ జరుగుతుందని వివరించారు. సీటు పొందిన విద్యార్థులు ఇదేనెల 31న కళాశాలలో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

సైబర్‌క్రైమ్స్‌పై విద్యార్థులకు అవగాహన

తిరుపతి(విద్య), జూలై 22: ఎస్వీప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సెట్విన్, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సైబర్‌క్రైమ్స్, ఈవ్‌టీజింగ్, వుమెన్ సేఫ్టీయాప్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, జనరల్ విభాగ హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో సెబ్ ఎస్ఐ స్వామినాథన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఈ విషయమై స్నేహితులతోపాటు తాము నివశించే పరిసరప్రాంతాల్లో ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. సెట్విన్ మేనేజర్ కె.మోహన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు ఈవ్‌టీజింగ్‌ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని, తమ మొబైల్ నెంబర్, యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ లాంటివి ఇతరులకు షేర్ చేయరాదని తెలిపారు. డాక్టర్ గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి తమ ఆశయాలను సాధించుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రేపు పాకాల పంచాయతీలో వేలం పాటలు

పాకాల, జూలై 22: పాకాల గ్రామ పంచాయతీ పరిధిలోని వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతువధశాల, షాపింగ్ కాంప్లెక్స్, చింత, కొబ్బరిచెట్లు ఫలసాయాలకు బుధవారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మోతీ తెలిపారు. అలాగే ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్, పారిశుధ్య మెటీరియల్ సరఫరాకోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. తగిన ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని ఆమె కోరారు.

కరెంట్ బిల్లులు ఫోన్‌తో ఇలా కట్టేద్దాం

క్యూఆర్ కోడ్ అందుబాటులోకి వస్తే ఇంకా సులభం

● వెబ్‌సైట్ ద్వారా ఇలా..



ఎస్పీడీసీఎల్‌కి చెందిన www.apspdcl.in ఓపెన్ చేసి, అందులో పే బిల్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తర్వాత డిజిటల్ పేమెంట్ గేట్‌వే కింద మూడు ఆప్షన్లు బిల్ డెస్క్, ఏపీ ఆన్‌లైన్, టీఏ (ట్రాన్సాక్షన్ అస్యూర్డ్) కనిపిస్తాయి. వీటిల్లో మీకు నచ్చిన పేమెంట్ గేట్‌వేను ఎంపిక చేసుకోవచ్చు. తర్వాత మీ మీటరు నెంబరు ఎంటర్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లు కట్టేయవచ్చు.

ఇదివరకు కరెంటు బిల్లు చెల్లించాలంటే విద్యుత్ కార్యాలయాల వద్దకెళ్లి కట్టేవాళ్లు. ఆ తర్వాత ఆన్‌లైన్, అనంతరం డిజిటల్ పేమెంట్స్ వచ్చాయి. తాజాగా ఇటీవల గూగుల్ పే, ఫోన్‌పే వంటి థర్డ్ పార్టీ యూపీఐ యాప్స్ ద్వారా చెల్లింపులు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈనెల ఒకటో తేదీనుంచి కొత్త ఆర్బీఐ నిబంధనలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు ఇకపై ఏపీఎస్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్ www.apspdcl.in లేదా దానికి సంబంధించిన యాప్ ద్వారానే చెల్లించాలి. ఇటీవల కాలంలో ఫోన్‌పే, గూగుల్ పేలో కరెంటు బిల్లులు చెల్లించడానికి అలవాటు పడిన వినియోగదారులు ఇప్పుడు వాటికి బ్రేక్ వేయడంతో కొంత గందరగోళంలో పడ్డారు. ఫోన్‌పే, గూగుల్ పేలో చెల్లింపులు సులభంగా ఉండడంతోపాటు నెలవారీ బిల్లును రిమైండ్ చేస్తుంది కూడా. ఒక్క క్లిక్‌తో బిల్లు కట్టేయచ్చు. ఇపుడు ఆ అవకాశం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అయితే పక్కరాష్ట్రమైన తెలంగాణలో బిల్లుకింద ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే డెబిట్, క్రెడిట్ కార్డులు, యూపీఐ, నెట్‌బ్యాంకింగ్ తదితర విధానాల్లో బిల్లులు చెల్లించేలా అక్కడ విద్యుత్ సంస్థ పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చింది. అక్కడొచ్చే ఫలితాల ఆధారంగా మనదగ్గర కూడాఈవిధానాన్ని అమలు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

●ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేనివారు..

ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేని వారు మీ దగ్గరలోని విద్యుత్ కార్యాలయం కానీ, సచివాలయం, మీసేవ కేంద్రానికి వెళ్లి బిల్లు చెల్లించవచ్చు.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి

● యాప్‌తో ఇలా..



మీఫోన్‌లో ఎస్పీడీసీఎల్ కన్జూమర్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్టర్ మొబైల్ నెంబరు ద్వారా లింకైన విద్యుత్ మీటర్ నెంబరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందులోని 'బిల్ పే' ఆప్షన్ ద్వారా మీ ఫోన్‌లో ఉండే ఫోన్ పే, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లు కట్టేయవచ్చు. ఈ యాప్‌లోనే పేమెంట్ హిస్టరీ, ఏ నెలలో ఎన్ని యూనిట్లు వినియోగించిందీ తెలిసిపోతుంది. అదేవిధంగా కొత్త మీటరు కనెక్షన్ కావాలన్నా ఈ యాప్‌లోనుంచే దరఖాస్తు చేసుకోవచ్చు.

తిరుపతి

గంజాయిని అంతం చేయండి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, జూలై 22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో గంజాయిని అంతం చేయాలని నియోజకవర్గ ఇంచార్జ్ కిరణ్‌రాయల్ ఎస్పీ సుబ్బరాయుడును కోరారు. సోమవారం ఆయన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కిరణ్‌రాయల్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గంజాయి స్మగ్లింగ్ విచ్చలవిడిగా సాగడంతో యువత చెడిపోయిందని, కొన్ని వందల కుటుంబాలు సర్వనాశనమయ్యాయన్నారు. తక్షణమే గంజాయిపై ఉక్కుపాదం మోపాలని, శాంతిభద్రతలు కాపాలని విజ్ఞప్తి చేశారు. సుమన్ బాబు, కిషోర్, మనోజ్, ఆది, షరీఫ్, శ్రీనివాసులు, హరి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన కాపుభవన స్థలం స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న శరత్‌రాయల్

తిరుపతి అర్బన్, జూలై 22: స్థానిక మంచినీళ్లగుంట, నరసింహతీర్థం రోడ్డులో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బలిజ కులస్థులకు కేటాయించిన కాపుభవన స్థలాన్ని కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు కబ్జాచేసి బహుళఅంతస్తును నిర్మించారని, దానిని స్వాధీనం చేసుకోవాలని స్థానిక బలిజ నేత శరత్‌రాయల్ డిమాండు చేశారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఆ స్థలం కాపుభవనానికి దక్కుతుందా లేదా అనుమానం కలుగుతోందన్నారు. కబ్జాకు పాల్పడిన వెంకటేశ్వర్లు మాస్టర్‌ప్లాన్‌రోడ్లు, ఫ్రీలెఫ్టుల రోడ్ల నిర్మాణంలో కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఆయన కబ్జా చేసిన కాపుభవన స్థలాన్ని తిరిగి అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బాలురాయల్, సతీష్‌రాయల్, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

తిరుపతి(క్రీడలు), జూలై 22: స్థానిక మహిళా యూనివర్శిటీ క్రీడా మైదానంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫుట్‌బాల్ జిల్లా అసోసియేషన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు భాస్కర్, రెడ్డెప్ప సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌జూనియర్, అండర్ 14 విభాగాలకు సంబంధించిన అంతర్‌జిల్లాల క్రీడాకారులు పాల్గొననున్నారు. ఇందులో రాణించిన క్రీడాకారులతో రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పంపనున్నారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22: జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన 5 నుంచి 18ఏళ్లలోపు వయసు కలిగిన బాలల నుంచి జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి ఎస్.జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, విద్య, ధైర్యసాహసాలు, క్రీడలు, కళలు, సాహిత్యం, సంస్కృతి, సంగీతం, నృత్యం, పెయిటింగ్, నూతన ఆవిష్కరణలు వంటి అంశాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచిన బాలలు ఈ నెల 31లోపు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్ర కమిటీ ద్వారా ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా జనవరి-2025లో బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారని తెలిపారు.

యువత ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి



తిరుపతి(విద్య), జూలై 22: యువత చదువుతో పాటు ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని తిరుపతి ఇస్కాన్‌కు చెందిన వైష్ణవాంఘ్రీ సేవక్‌దాసు అన్నారు. శ్రీ పద్మావతి జూనియర్ కళాశాలలో నైతిక విలువలు - జీవిత లక్ష్యాలు అనే అంశంపై విద్యార్థినులకు అవగాహనా కార్యక్రమం సోమవారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వైష్ణవాంఘ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... భాగవతం, ఇతిహాసాల్లోని పాత్రలను అభ్యసించి తద్వారా ఎలాంటి విలువలను పెంపొందించుకోవచ్చో వివరించారు. ప్రిన్సిపాల్ భువనేశ్వరి మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే నైతిక విలువలను పెంపొందించేందుకుగాను ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ముఖ్య అతిథులను సన్మానించి, జ్ఞాపికలతో సత్కరించారు. ఇస్కాన్‌కు చెందిన నిత్యముక్తదాసు, భవానీప్రసాద్, విద్యార్థి సమాఖ్య సభ్యులు డాక్టర్ జయమ్మ, హాస్టల్ వార్డెన్ డాక్టర్ స్నేహలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో గురుపూర్ణిమ వేడుకలు



వ్యాసరచన పోటీల విజేతలతో కళాశాల ప్రిన్సిపాల్ తదితర అధ్యాపకులు

తిరుపతి(విద్య), జూలై 22: తిరుపతి శ్రీ గోవిందరాస్వామి ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలుగు, సంస్కృతం విభాగాలు సంయుక్తంగా సోమవారం గురుపూర్ణిమ వేడుకలను నిర్వహించాయి. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం సంస్కృతం అధ్యాపకులు డాక్టర్ కె.కోటేశ్వరయ్య, తెలుగు, సంస్కృతం విభాగాల అధిపతి డాక్టర్ ఎం.మాదన్న వ్యాసుడి జన్మదినం గురుపూర్ణిమగా ఎలా అయిందో వివరించారు. వ్యాసరచన పోటీల విజేతలకు ప్రిన్సిపాల్ సత్యనారాయణ బహుమతులు అందజేసి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వరి, తెలుగు అధ్యాపకులు కొండలరావు, వసంతకుమారి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.99 కోట్లు

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.99 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 75,963 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,956 మంది తలనీలాలు సమర్పించారు.

పీజీఆర్‌ఎస్‌లో 146 అర్జీలు





అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్ - బాధితుడితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22: కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి 665 అర్జీలు వచ్చాయని, అందులో 285 పరిష్కారమైనట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన అర్జీల్లో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్‌కు ఎక్కువగా వచ్చాయన్నారు. పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి తాజాగా 146 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయని, భూసమస్యలపై అత్యధికంగా రెవెన్యూశాఖకు 112 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు.డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్రరెడ్డి, ఏవో జయరాములు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.జిల్లాలో చాలా చోట్ల అంగన్‌వాడీ భవనాలు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని సామాజిక చైతన్య వేదిక ప్రతినిధులు జయలక్ష్మి, నీతీషా, రాజేశ్వరి, ప్రభాకర్ తదితరులు డీఆర్వో పెంచల కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. తక్షణమే అంగన్‌వాడీ భవనాలు నిర్మించి చిన్నారుల భవిష్యత్తును కాపాడాలన్నారు.రేణిగుంట మండలం కరకంబాడి వద్ద జాతీయ రహదారి కోసం ఇళ్లను కోల్పోయిన కరకంబాడివాసులు నష్టపరిహారం తొందరగా చెల్లించాలని కోరారు. ఉపాధిహామీలో 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను రాజీనామా చేయాలని ఒత్తిడి చేయడం భావ్యం కాదని క్షేత్ర సహాయకులు వాపోయారు.మండలాల్లో పనిచేసే చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. కలెక్టరేట్ వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేధింపులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కోశాధికారి ప్రసాద్‌రావు,పుల్లయ్య, జయచంద్ర, లక్ష్మి, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్, గురవయ్య, చెంగయ్య, వేణుగోపాల్, మాధవ్, మునిరాజా, బుజ్జి, రాజేశ్వరి, ధనమ్మ, మురగేష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనలో ప్రసంగిస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

మా నాన్న ఉద్యోగం ఇవ్వండి



మా నాన్న జయరామ్ తిరుపతి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు మేనేజరుగా పని చేస్తూ రెండేళ్ల క్రితం గుండెపోటుతో మరణించాడు.కారుణ్య నియామకం కింద నాకు ఉద్యోగం ఇవ్వాలని రెండేళ్లుగా టౌన్ బ్యాంకు అధికారులకు, పాలకవర్గానికి ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా చీదరింపులే మిగిలాయి. ఎంబీఏ వరకు చదివి, కడప కోఆపరేటివ్ బ్యాంకులో శిక్షణ కూడా తీసుకున్నా.

– సురేఖ, తిరుపతి

మెకానిక్‌కు ఆర్థిక సాయం

తిరుపతి (జీవకోన), జూలై 22: జిల్లా టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్‌లో మురుగ అనే మెకానిక్‌కు ఫైల్స్ ఆపరేషన్ జరిగింది. జిల్లా టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మురుగ కుటుంబానికి సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందచేశారు. మునిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి టూ వీలర్స్ మెకానిక్ ఆరోగ్యమే పరమావధిగా సంఘం పనిచేస్తుందన్నారు. మెకానిక్స్ ఎవరైనా ప్రమాదానికి గురైతే రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందించేందుకు త్వరలోనే ప్రణాళికలు చేస్తున్నామన్నారు. గౌరవాధ్యక్షులు మల్లీశ్వరి, సంయుక్త కార్యదర్శి గురవాచారి, సోమశేఖర్, విక్కీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల మాఫియాలో అధికారులదే కీలక పాత్ర



మాట్లాడుతున్న నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి అర్బన్, జూలై 22: వైసీపీ హయాంలో వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్ల భూసేకరణకు ఇచ్చిన టీడీఆర్ బాండ్ల మాఫియాలో మున్సిపల్, రెవెన్యూ, రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులే కీలక పాత్ర పోషించారని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. టీడీఆర్ బాండ్ల మాఫియా భరతం పట్టాలని ముఖ్యమంత్రికి ఇప్పటికే లేఖ కూడా రాశానన్నారు. సిట్ లేక విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో టీడీఆర్ బాండ్ల ముసుగులో ప్రజాధనాన్ని కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాకు కన్నం పెట్టిన అప్పటి కమిషనర్, టౌన్‌ప్లానింగ్ కీలక అధికారులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కొంతమంది కార్పొరేటర్లు బాధ్యులని స్పష్టం చేశారు. వీరిని తక్షణమే జ్యుడిషియల్ కస్టడీలోకి తీసుకొని కఠినంగా శిక్షించాలన్నారు. టీటీడీకి సంబంధించిన స్థలాల్లో ఫ్రీలెఫ్టులు వేశారని, వాటికి టీడీఆర్ బాండ్లు ఎందుకు ఇవ్వలేదని, అందులో ఆంతర్యమేమిటనీ ప్రశ్నించారు. స్వచ్ఛందంగా భూములిచ్చిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు.పులిగోరు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తరతరాలుగా అనుభవిస్తున్న భూములను మాస్టర్‌ప్లాన్ రోడ్లలో భాగంగా కోల్పోయినా ఇప్పటికీ టీడీఆర్ బాండ్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.శ్రీనివాసులశెట్టి మాట్లాడుతూ తమ భూములు మాస్టర్‌ప్లాన్‌లో లేకపోయినా అప్పటి ఆర్‌ఐ (ప్రస్తుతం డీటీ)సహకారంతో వైసీపీ నాయకులు దౌర్జన్యంగా తమ స్థలంలో రోడ్లు వేశారన్నారు. హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చినా టీడీఆర్ బాండ్లు ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. ఇది కోర్టు ధిక్కరణ కింద పరిగణించి అవినీతి అధికారులను శిక్షించి, తమకు న్యాయం చేయాలని కోరారు.

సెలూన్ షాపు నిర్వాహకుడి మృతి

నెల్లూరు(క్రైం), జూలై 22: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతికి చెందిన రవికుమార్(40) కొంతకాలంగా నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి గుడి సమీపంలోని పోలీసు కాలనీలో నివాసం ఉంటూ, నిప్పో సెంటర్ వద్ద సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆయన ఈనెల 21వ తేదీన బుజబుజనెల్లూరుకు వెళ్లి తూర్పువైపు నుంచి పడమర వైపునకు జాతీయ రహదారి దాటుతుండగా చెన్నై వైపు నుంచి నెల్లూరు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈఘటనలో రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై ఏకే నగర్‌లో ఉంటున్న మృతుడి బావమరిది వెంకటసుబ్బయ్య సౌత్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విపత్తుల సమయంలో ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి: కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), జూలై 22: విపరీతమైన వర్షాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తులు వచ్చినపుడు ముందస్తు ప్రణాళికలతో అధికారులు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నీటిపారుదల శాఖ కరకట్టలను పటిష్ట పరచాలన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు బలహీనమైన కల్వర్టులను గుర్తించి తెగిపోతే ప్రత్యామ్నాయ మార్గాల ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. నవంబరు, డిసెంబరులో ఎక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, డీపీవో సుశీలాదేవి, అధికారులు మధుసూదనరావు, విజయకుమార్, శంకర్‌నారాయణ, రమణయ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ద్వారా పీహెచ్‌సీల పరిధిలో నిర్వహిస్తున్న పింక్‌బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో స్విమ్స్ బయో ప్రత్యేకాధికారి డాక్టర్ జయచంద్రారెడ్డి తదితర అధికారులతో కలిసి క్యాన్సర్ స్క్రీనింగ్‌పై సమీక్షించారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన వారు చికిత్స కోసం స్విమ్స్ ఆంకాలజీ విభాగానికి తప్పకుండా వచ్చేలా సంబంధిత పీహెచ్‌సీ డాక్టర్, ఎంఎల్‌హెచ్‌పీ చర్యలు తీసుకోవాలన్నారు.

తిరుపతిలో పర్యాటక అభివృద్ధికి కమిటీ వేశారా?: ఎంపీ గురుమూర్తి

తిరుపతి(నేరవిభాగం), జూలై 22: తిరుపతిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి సహకార కమిటీని వేశారా లేదా అని సోమవారం పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. దీనిపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానం ఇస్తూ.. తిరుపతి సహా దేశం మొత్తం సమగ్రంగా ప్రమోట్ చేయడానికి మంత్రిత్వ శాఖ ప్రయత్నిస్తోందన్నారు. ప్రస్తుతానికి తిరుపతికి స్వదేశ్ దర్శన్ 2.0లేదా ప్రసాద్ పథకాల కింద మంజూరుచేయబడిన ప్రాజెక్టులు ఏమీ లేవన్నారు.

కోదండరాముడికి 31 నుంచి పవిత్రోత్సవాలు

తిరుపతి (కల్చరల్) జూలై 22: తిరుపతిలోని కోదండ రామస్వామి ఆలయంలో జూలై 31 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. జూలై 31వ తేదీ సాయంత్రం అంకురార్పణ జరుగుతుంది. ఆగస్టు ఒకటి, రెండు తేదీలలో జరిగే కార్యక్రమానికి ఇద్దరు గృహస్తులు రూ.500 టికెట్టు తీసుకుని పాల్గొనవచ్చు. ఈ మూడు రోజులూ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధర్మప్రచార పరిషత్ కళాకారులు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఎనర్జీ ఆడిట్ జీఎంగా కృష్ణారెడ్డి



కృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతున్న అధికారులు, ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 22: ఆంధ్రప్రదేశ్ సదరన్ డిస్కం ఎనర్జీ ఆడిట్ జనరల్ మేనేజరుగా ఆశాఖ కార్యాలయంలో సోమవారం ఎం.కృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆ స్థానంలో వున్న వెంకట సుబ్బయ్య పదవీ విరమణ చేశారు. దీంతో ఇటీవల తిరుపతి సర్కిల్ ఎస్ఈగా రిలీవ్ అయిన కృష్ణారెడ్డి జీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. కృష్ణారెడ్డికి కార్పొరేట్ కార్యాలయ అధికారులు అయూబ్ ఖాన్, ఈఈలు వాసుదేవరెడ్డి, దామోదరం, శ్రీనివాసమూర్తి, డీఈఈలు జయప్రకాష్, విష్ణువర్ధన్, మునిప్రసాద్, ప్రభాకర్, ఏఈలు గణపతి, వివేకానంద తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కరెంట్ బిల్లులు
ఫోన్‌తో ఇలా కట్టేద్దాం

క్యూఆర్ కోడ్ అందుబాటులోకి వస్తే ఇంకా సులభం

● వెబ్‌సైట్ ద్వారా ఇలా..



ఎస్పీడీసీఎల్‌కి చెందిన www.apspdcl.in ఓపెన్ చేసి, అందులో పే బిల్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తర్వాత డిజిటల్ పేమెంట్ గేట్‌వే కింద మూడు ఆప్షన్లు బిల్ డెస్క్, ఏపీ ఆన్‌లైన్, టీపీ (ట్రాన్సాక్షన్ అస్యూర్డ్) కనిపిస్తాయి. వీటిల్లో మీకు నచ్చిన పేమెంట్ గేట్‌వేను ఎంపిక చేసుకోవచ్చు. తర్వాత మీ మీటరు నెంబరు ఎంటర్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లు కట్టేయవచ్చు.

ఇదివరకు కరెంటు బిల్లు చెల్లించాలంటే విద్యుత్ కార్యాలయాల వద్దకెళ్లి కట్టేవాళ్లు. ఆ తర్వాత ఆన్‌లైన్, అనంతరం డిజిటల్ పేమెంట్స్ వచ్చాయి. తాజాగా ఇటీవల గూగుల్ పే, ఫోన్‌పే వంటి థర్డ్ పార్టీ యూపీఐ యాప్స్ ద్వారా చెల్లింపులు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈనెల ఒకటో తేదీనుంచి కొత్త ఆర్బీఐ నిబంధనలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు ఇకపై ఏపీఎస్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్ www.apspdcl.in లేదా దానికి సంబంధించిన యాప్ ద్వారానే చెల్లించాలి. ఇటీవల కాలంలో ఫోన్‌పే, గూగుల్ పేలో కరెంటు బిల్లులు చెల్లించడానికి అలవాటు పడిన వినియోగదారులు ఇప్పుడు వాటికి బ్రేక్ వేయడంతో కొంత గందరగోళంలో పడ్డారు. ఫోన్‌పే, గూగుల్ పేలో చెల్లింపులు సులభంగా ఉండడంతోపాటు నెలవారీ బిల్లును రిమైండ్ చేస్తుంది కూడా. ఒక్క క్లిక్‌తో బిల్లు కట్టేయచ్చు. ఇపుడు ఆ అవకాశం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అయితే పక్కరాష్ట్రమైన తెలంగాణలో బిల్లుకింద ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే డెబిట్, క్రెడిట్ కార్డులు, యూపీఐ, నెట్‌బ్యాంకింగ్ తదితర విధానాల్లో బిల్లులు చెల్లించేలా అక్కడ విద్యుత్ సంస్థ పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చింది. అక్కడొచ్చే ఫలితాల ఆధారంగా మనదగ్గర కూడా ఈవిధానాన్ని అమలు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

●ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేనివారు..

ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేని వారు మీ దగ్గరలోని విద్యుత్ కార్యాలయం కానీ, సచివాలయం, మీసేవ కేంద్రానికి వెళ్లి బిల్లు చెల్లించవచ్చు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● యాప్‌తో ఇలా..



మీఫోన్‌లో ఎస్పీడీసీఎల్ కస్యూమర్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్టర్ మొబైల్ నెంబరు ద్వారా లింకైన విద్యుత్ మీటర్ నెంబరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందులోని 'బిల్ పే' ఆప్షన్ ద్వారా మీ ఫోన్‌లో ఉండే ఫోన్ పే, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లు కట్టేయవచ్చు. ఈ యాప్‌లోనే పేమెంట్ హిస్టరీ, ఏ నెలలో ఎన్ని యూనిట్లు వినియోగించిందీ తెలిసిపోతుంది. అదేవిధంగా కొత్త మీటరు కనెక్షన్ కావాలన్నా ఈ యాప్‌లోనుంచే దరఖాస్తు చేసుకోవచ్చు.

సేంద్రియ సాగుతో మోడల్ న్యూట్రీ గార్డెన్


విత్తనాలు నాటుతున్న అధికారులు

బాలాయపల్లి,జూలై22: స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల కింద మోడల్ న్యూట్రీ గార్డెన్ ఏర్పాటుకు సేంద్రియ సిబ్బంది,వెలుగు, ఉపాధి హామీ పథకం ఏపీఓలు సోమవారం విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ పండ్ల మొక్కల ఫలసాయం వల్ల ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మృత్యుంజయరావు,ఇన్‌చార్జి ఏపీఎం శ్రీను,హెడ్ సీసీమమత తదితరులు పాల్గొన్నారు.

సాగుచేసుకునేలా చర్యలు తీసుకోవాలని వినతి


తహసీల్దారును కలిసిన గిరిజనులు

బాలాయపల్లి, జూలై22: ప్రభుత్వం ఇచ్చిన భూమిలో సాగును అడ్డుకుంటున్నారంటూ పెరిమిడికి చెందిన 20 కుటుంబాలు సోమవారం తహసీల్దార్ పుల్లారావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2005లో 0.97 సెంట్ల చొప్పున ప్రభుత్వం తమకు సీజేఎఫ్ఎస్ పట్టాలు అందజేసిందన్నారు. సాగుకు మూడు బోర్లు కూడా మంజూరు చేసిందన్నారు. అయితే గ్రామంలోని కొందరు తమ భూములను ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారు అటవీశాఖాధికారులను పంపి సాగు చేసుకోనీయడం లేదన్నారు. తమకు ఈ అడ్డంకులు తొలగించాలని కోరారు.

ఏబీవీపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం


మాట్లాడుతున్న చందు

నాయుడుపేట, జూలై 22 :స్థానిక వేమ కళాశాలలో సోమవారం ఏబీవీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తడుకు చెందు విద్యార్థులతో మాట్లాడారు. నలుగురు సభ్యులతో ఏర్పాటైన ఏబీవీపీ నేడు దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. విద్యార్థుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. దేశభక్తిభావం పెంపొందిస్తుందన్నారు. ఏబీవీపీ నాయకులు వినయ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



గూడూరు, జూలై 22: చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్వర్ణాంధ్రభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ నవ కోటినాయుడు అన్నారు. స్థానిక మాళవ్యానగర్‌లోని తమ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఇండియన్ ఒలంపియాడ్ అకాడమి సైన్స్ రెండో దశ పోటీలకు అర్హత సాధించారని ఆయన చెప్పారు. సోమవారం వారికి సర్టిఫికెట్లును అందజేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సునీల్‌రాజ్, హరికృష్ణ, సంధ్యా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా సాయిబాబాకు నగరోత్సవం

నాయుడుపేట టౌన్, జూలై 22 : తుగ్రహారపేటలోని షిరిడీసాయిబాబా నగరోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గురుపూర్ణిమ ఉత్సవాలు చివరి రోజు రాత్రి ఆలయం నుంచి ప్రత్యేక పుష్పాలంకరణతో మంగళవాయిద్యాల నడుమ సాయిబాబాను నగరోత్సవంలో ఊరేగించారు. ముందుగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి ప్రభాకర్‌నాయుడు, కోశాధికారి పూనాటి తిరుమలనాయుడు, కార్యదర్శి చింతపూడి శ్రీధర్‌కుమార్, ఉపాధ్యక్షుడు ముత్యాలురెడ్డి, లోకేష్‌రెడ్డి, రఫీ, రమేష్, సిద్దయ్య, వెంకటేశ్వరరావు, పసుపులేటి రాజాబాబు, రామచంద్రారెడ్డి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ సాయిలక్ష్మి

పెళ్లకూరు, జూలై 22 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత శిశు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సాయిలక్ష్మి అన్నారు. సోమవారం పెళ్లకూరు అంగన్‌వాడీ కేంద్రంలో వెయ్యి రోజుల సంరక్షణ కార్యక్రమంపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరి జీవితంలో మొదటి 1000 రోజులు ముఖ్యమైనవన్నారు. ఈ రోజుల్లోనే చిన్నారులలో శారీరక, మానసిక పెరుగుదల చాలా వేగంగా ఉంటుందన్నారు. ఈ రోజులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అందించాల్సిన ఆహారంపై తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుజ్జమ్మ, మల్లెమ్మ, హేమలత తదితరులు ఉన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మత్స్యకారుల సమస్య పరిష్కరించాలి: ఎంపీ



తడ, జూలై 22 : పులికాట్ తీరప్రాంత మత్స్యకారుల సమస్యను పరిష్కరించాలని ఎంపీ మద్దెల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మత్స్యకార సమస్యలను ప్రస్తావించారు. 20వేల మంది మత్స్యకారులు ఈ సరస్సుపై ఆధారపడ్డారన్నారు. తమ జిల్లాకు చెందిన మత్స్యకారులు 5 హెచ్‌పీ సామర్థ్యం ఇంజన్లను వేటకు వాడుతుంటే తమిళనాడు మత్స్యకారులు 400, 500 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన భారీ పడవలతో వేటాడుతున్నారన్నారు. తమ జిల్లా మత్స్యకారుల పడవలను వలలను వారు ధ్వంసం చేస్తున్నారన్నారు. దాడులకు కూడా దిగుతున్నారన్నారు. రెండు రాష్ట్రాల మధ్య సున్నితమైన ఈ సమస్యపై కేంద్రం జోక్యం చేసుకోవాలని ఎంపీ కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ర్యాలీ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీడీపీవో, సూపర్ వైజర్లు

కోట, జూలై 22 :బాల్య వివాహాలను అవగాహనతో నిర్మూలించాలని సీడీపీవో మునికుమారి పిలుపునిచ్చారు. ఆకుతోటదిబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని తల్లులు, గరిణులు దీనికి హాజరయ్యారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను ఆమె వివరించారు. తరువాత ఆకుతోటదిబ్బలో ర్యాలీ నిర్వహించారు. సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.99 కోట్లు

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.99 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 75,963 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,956 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలేశుడి సేవలో సుజయనిధితీర్థ స్వామి

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదరాజ మఠాధిపతి సుజయనిధి తీర్థ స్వామి సోమవారం పెద్దమర్యాదతో తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు చేరుకున్న స్వామికి టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, అర్చక బృందం వెళ్లి శఠగోపం సమర్పించి ఇస్తికాఫల్(ఆలయ మర్యాద) స్వాగతం పలికారు. శిష్యబృందంతో సుజయనిధితీర్థ స్వామి ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22: జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన 5 నుంచి 18ఏళ్లలోపు వయసు కలిగిన బాలల నుంచి జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.జయలక్ష్మి తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, విద్య, ధైర్యసాహసాలు, క్రీడలు, కళలు, సాహిత్యం, సంస్కృతి, సంగీతం, నృత్యం, పెయిటింగ్, నూతన ఆవిష్కరణలు వంటి అంశాల్లో ప్రతిభ కనబరచిన బాలలు ఈ నెల 31లోపు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా జనవరి-2025లో బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు.

మునుగుడాకు..తరలింపునకు సాకు

●పూజల కోసమంటూ కూలీల వాదనపై అనుమానాలు


మునుగుడాకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న కూలీలు

వెంకటగిరి, జూలై 22 : వెలుగొండ అడవులు కేంద్రంగా మునుగుడాకును స్మగ్లింగ్ చేస్తూ కొందరు అక్రమార్కులు భారీగా సంపాదిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్లకు మరిగిన అటవీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వెలుగొండ అడవుల్లో అరుదుగా లభించే మునుగుడాకుకు ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. మారేడు ఆకును పోలి ఉండటంతో దీనిని ప్రముఖ ఆలయాల్లో పూజలకు ఉపయోగిస్తున్నారని సమాచారం. బీడీ తయారీలో కూడా ఉపయోగిస్తున్నారు. ఆయుర్వేద మందుల తయారీకి వాడుతున్నట్లు చెబుతున్నారు. కొందరు చెన్నైలోని కెమికల్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆకుమాటున విలువైన ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నారన్న స్థానికంగా కొండ దిగువ గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. చెట్లు నరికి ఆకును బస్తాల ద్వారా తరలిస్తున్నారు. బస్తాల మాటున ఎర్రచందనం కూడా తరలిపోతుందని తెలిసింది. శ్రీకాళహస్తిలోని ఆలయ పూజలకు తీసుకు వెళుతున్నామని కూలీలు చెబుతున్న తీరుపై స్థానికంగా పలు సందేహాలు కలుగుతున్నాయి. బస్తా ఆకు ధర రూ. 100 పలుకుతుందనే వీరి వాదన విశ్వసనీయంగా లేదంటున్నారు.. రోజుల తరబడి అడవుల్లో వుంటూ ఆకును సేకరిస్తున్నారంటే ఎంత గిట్టుబాటవుతుందో అర్థం చేసుకోవచ్చు. అటవీ అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి మరీ ఈ ఆకుకు తరలిస్తున్నారంటే గిరాకీ తెలుసుకోవచ్చు. అటవీశాఖ అధికారులను వివరణ కోరగా పూజల కోసమే అడవుల్లో మునుగుడాకు సేకరిస్తున్నట్లు చెప్పారు. చెట్ల నరికి వేత వల్ల అడవులు అంతరించి పోయే ప్రమాదమున్నా పట్టించుకోక పోవడంపై అధికారుల తీరును గ్రామస్తులు తప్పుబడుతున్నారు.

సాయంత్రమైతే దోమలు బాబోయ్ దోమలు

బెంబేలెత్తుతున్న పట్టణ ప్రజలు


మిషన్‌తో ఫాగింగ్ (ఫైల్‌ఫొటో)


మురుగునీటిపై దోమలు

గూడూరు, జూలై 22: పట్టణవాసులను కొద్దిరోజులుగా దోమలతో సతమతమవుతున్నారు. సాయంత్రమైతే అల్లాడిపోతున్నామని వాపోతున్నారు. అడపాదడపా వర్షాలు పడుతుండడంతో పలు ప్రాంతాల రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. మురుగునీరు నిల్వ చేరుతుండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కాలువల్లో అయిల్‌బాల్స్‌ను వేయడం కానీ, స్ప్రేయర్ల ద్వారా పిచికారి చేయడం గానీ చేపట్టలేదు. మోటార్ల స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నా వినియోగించడం లేదనే విమర్శలున్నాయి. నామమాత్రంగా వాహనాలకు ఫాగింగ్ మిషన్‌లను ఏర్పాటు చేసి పిచికారి చేస్తుండడంతో ఆశించిన ఫలితం దక్కడంలేదు. దూర్జటినగర్, సనత్‌నగర్, ఐసీఎస్‌రోడ్డు, వరదానగర్, ఇందిరానగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజలు అవస్థలుపడుతున్నారు. దోమకాటుకు గురైన వారు జ్వరాలతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వారానికి రెండు రోజులు ఫాగింగ్ మిషన్ ద్వారా పిచికారి చేస్తున్నా ఫలితం ఉండటంలేదని ఆందోళన చెందుతున్నారు.

టీచర్ వైద్యానికి ఆర్థిక సాయం చేయండి : ఎస్టీయూ


కలెక్టర్ వెంకటేశ్వర్‌తో ఎస్టీయూ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22: జిల్లా ఎస్టీయూ నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల విధుల్లో తీవ్ర అస్వస్థతకు గురయిన బుచ్చినాయుడుకండ్రిగ మండలం చిన్నాయగుంటకు చెందిన సుమన్‌రావు అనే ఉపాధ్యాయుడి వైద్యానికి అధిక మొత్తంలో వైద్య ఖర్చయిందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయనకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ నాయకులు గాజుల నాగేశ్వరరావు, ధనంజయనాయుడు, రమేష్, జగన్నాథం, కటారి మోహన్‌రెడ్డి, దేవేంద్ర, రామాంజనేయులు, గురుప్రసాద్, వేణు, వాసు, రేణుకాదేవి, దాక్షాయణి, రమాదేవి, మునికృష్ణ, మురళికృష్ణ, గుమ్మడి మురళి, మునిశేఖర్, హరిబాబు, మధుసూదన్, రమేష్‌నాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టాలమ్మ గ్రామోత్సవం



కోట, జూలై 22 : చెందోడులో సోమవారం పుట్టాలమ్మ గ్రామోత్సవం జరిగింది. దీంతో మూడు రోజులపాటు జరిగిన అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా మేళతాళాలతో పుట్టాలమ్మ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాక అవస్థలు

అధిక చార్జీలతో ఆటోల్లో ప్రయాణం


ఆటోలో ప్రయాణిస్తున్న గ్రామస్థులు

చిల్లకూరు, జూలై 17: మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో గ్రామీణులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు, పలు ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని ఓడూరు, రెట్టపల్లి, పున్నపువారిపాళెం, తిమ్మనగారిపాళెం, తీపనూరు తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. తిప్పగుంటపాళేనికికి బస్సు వెళ్తున్నా విద్యార్థులకు అనుకూల సమయంలో తిరగడం లేదు. దీంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. అదేవిధంగా ఓడూరు, రెట్టపల్లి, తిమ్మనగారిపాళెం గ్రామాలకు చెందిన వారు కూడా తమ గ్రామాలకు బస్సులు రావడంలేద ంటున్నారు. బస్సులు గ్రామాలకు రాకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన వారు అధిక చార్జీలతో ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టిప్పర్ ఢీకొని మహిళ మృతి

సత్యవేడు, జూలై 22: టిప్పర్ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన సత్యవేడులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వీరాంజనేయులు కథనం మేరకు... పట్టణంలోని ఉలవచేను కాలనీలో నివాసం ఉంటున్న ప్రేమనాథ్ తమిళనాడు ఆర్టీసీలో కండెక్టర్‌గా పని చేస్తున్నారు. సోమవారం భార్య ఉమాతో కలిసి ద్విచక్ర వాహనంలో పట్టణంలోకి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళుతుండగా స్టేట్ బ్యాంకు సమీపంలో వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చొన్న ఉమ(31)కి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవరుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్జీలతో కదిలొచ్చారు..


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22: ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థలో ప్రజలు తెలిపే సమస్యలకు అధికారులు సత్వరమే పరిష్కారమార్గాలు చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అర్జీలపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి 665 అర్జీలు వచ్చాయని, అందులో 285 పరిష్కారమైనట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన అర్జీలు పలు దశల్లో ఉన్నాయని, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్‌కు ఎక్కువగా వచ్చాయన్నారు. అర్జీదారుల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఇదిలా ఉంటే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 146 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయని, భూసమస్యలపై అత్యధికంగా రెవెన్యూశాఖకు 112 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన కొంతమంది అధికారులు మాత్రం సెల్‌ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్రరెడ్డి, ఏవో జయరాములు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాలువల తీరుపై అన్నదాత కలవరం


పొలాల మధ్య రూపు కోల్పోయిన పంట కాలువ

ఓజిలి, జూలై 22 : దెబ్బతిన్న పంట కాలువలు గుదిబండగా తయారయ్యాయని రైతులు వాపోతున్నారు. మండలంలో 8వేల ఎకరాల్లో చెరువుల కింద వరి సాగు చేస్తున్నారు. చెరువులకు నీరు చేరితేనే సాగవుతుంది. పంట కాలువలు అస్తవ్యస్థంగా ఉండటంతో చెరువులకు నీరు చేరడంలేదు. ఏటా సాగు నీరు వృథా అవుతోంది. ఓజిలి, మానమాల, కురుగొండ, కొండవల్లిపాడు, పార్లపల్లి, వెంకటరెడ్డిపాళెం, వాకాటివారికండ్రిగ, ఆరిమేనిపాడు, సగుటూరు, భట్లకనుపూరు, కరబల్లవోలు, ఇనుగుంట, వజ్జావారిపాలెం, పాలెంపాడు, అత్తివరం తదితర గ్రామాలలో చెరువుల కింద సాగు చేపడుతున్నారు. ఆయకట్టు భూములను దుక్కి చేసేందుకు సిద్ధమవుతుంటే కాలువలు ప్రతికూలంగా మారాయి. కాలువలను సరిచేసుకోవడం తలకు మించిన భారంగా మారుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉపాధి నిధులతో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నిరుపయోగంగా మినీ క్రికెట్ స్టేడియం

రాత్రైతే మందు బాబుల అడ్డా



సత్యవేడు మినీ స్టేడియం - పగిలిపోయిన అద్దాలు

సత్యవేడు, జూలై 22: గ్రామీణ ప్రాంత యువతలో దాగున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, వారికి సరైన శిక్షణ ఇచ్చి మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గతంలో టీడీపీ ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక మినీ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులోని బాబు డిగ్రీ కాలేజీ సమీపంలో సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ.2.10 కోట్లు వెచ్చించి అన్ని హంగులతో మినీ క్రికెట్ స్టేడియం నిర్మించారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే తలారి ఆదిత్య దీనిని ప్రారంభించారు. స్టేడియంలో శారీరక వ్యాయామానికి సంబంధించిన పరికరాలు, ఒక షటిల్ కోర్టు, టెన్నిస్ కోర్టు, ఇండోర్ స్టేడియం, పెవిలియన్ ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కొన్నాళ్లు ప్రభుత్వ పర్యవేక్షణలో స్టేడియం నిర్వహణ సజావుగా సాగింది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో స్టేడియానికి గ్రహణం పట్టింది. నిర్వహణను పట్టించుకోక పోవడంతో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. సాయంత్రం ఆరుదాటితే సమీప ప్రాంతాల్లోని మందు బాబులు ఇక్కడకు చేరుకుని మద్యం తాగి స్టేడియం ప్రాంగణాన్ని అపరిశుభ్రం చేస్తున్నారు. ఆకతాయిల ఆగడాలకు స్టేడియంలోని గదులకు, కిటీలకు అమర్చిన అద్దాలు పగిలిపోయి, కళావిహీనంగా మారింది. స్టేడియం చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవిలా మారి భయానక వాతావరణం నెలకొంది. స్థానిక యువతను క్రీడకారులుగా తయారు కావాల్సిన స్టేడియంలో అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టేడియానికి శాశ్వత కోచ్(శిక్షకుడు)ను నియమించి, క్రీడలపై యువతకు శిక్షణనిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యువత, విద్యార్థులు కోరుతున్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోండి



కలెక్టరేట్‌లో ఆర్.మల్లవరంవాసులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22: తమ గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రేణిగుంట మండలంలోని ఆర్.మల్లవరంవాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చారు. తమ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల జాతీయ రహదారి విస్తరణలో పోయిందని, గత రెండేళ్లుగా ఓ ప్రైవేటు భవనంలో పిల్లలు చదువుకుంటున్నారని తెలిపారు. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో తామే స్థలం సేకరించామని, అక్కడ పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకుని మా పిల్లల బంగారు భవిష్యత్తును కాపాడాలని కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు ఎవరూ స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బిడ్డల భవిష్యత్తు కోసం దృష్టి సారించి హైవే అథారిటీ అందజేసిన నగదుతో పాఠశాల భవనాన్ని నిర్మించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్.మల్లవరం గ్రామస్తులు వాణి, మమాల, ఈశ్వర్, రామమూర్తి, ప్రసాద్, మాధురి, నాగమ్మ, నందిని తదితరులు పాల్గొన్నారు.

మా ఇంటి స్థలంపై ఇతరులకు హక్కుపత్రం ఇచ్చారు

పుత్తూరు సర్వే నెంబరు 206/14ఏ లో ఉన్న తమ ఇంటి స్థలంపై ఇతరులకు రెవెన్యూ అధికారులు హక్కుపత్రం ఇచ్చారని పట్టణంలోని చాకలపేట వీధికి చెందిన నాగరాజు తెలిపారు. తమ ఇంటి స్థలానికి ఆనుకుని కొంత ప్రభుత్వ భూమి ఉందని, పుత్తూరు రెవెన్యూ అధికారులు వేరే వారి వద్ద డబ్బులు తీసుకుని తమ స్థలంతో పాటు ప్రభుత్వ భూమికి కూడా హక్కుపత్రం మంజూరు చేశారని, దీంతో కబ్జాదారులు ఆ స్థలాన్ని ఇతరులకు అమ్మేశారని బాధితుడు నాగరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అధికారులు చర్యలు తీసుకుని తన స్థలాన్ని తనకు అప్పగించాలని కోరారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి ఆర్థిక సాయం

పిచ్చాటూరు, జూలై 22: మండలంలోని వెంగళత్తూరు జడ్పీ హైస్కూలు విద్యార్థిని జోష్న ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమె చదువుల ఖర్చుల కోసం రూ.25 వేలు నగదు అందజేశారు.

ప్రజా సమస్యలపై అలసత్వం వద్దు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 22: ప్రజా సమస్యలపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మహమ్మద్ ఆలీఖాన్ అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల ప్రజా వేదికలో వచ్చే అర్జీలపై సత్వరం విచారణ చేపట్టి నివేదిక అందజేయాలన్నారు. మండలంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయం, సచివాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు, సీనియర్ సహాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం... ఆక్సిజన్ పెంచుదాం

ఏర్పేడు, జూలై 22: మొక్కలు నాటి ఆక్సిజన్‌ను పెంచుతామని సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశవులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ ఏకాంబరం అన్నారు. మండలంలోని పెనగడం పంచాయతీ హరిజనవాడలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీల ద్వారా మొక్కలు నాటుదాం.. ఆక్సిజన్‌ను పెంచుదాం అనే కార్యక్రమం ఒక గొప్ప ఆలోచన అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు స్రవంతి, నరేష్, గీత, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్ర, టీడీపీ నాయకులు మనోహర్ నాయుడు, చందు, సిసింద్రీ, జనసేన నాయకుడు భానచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం



కలశాలతో ప్రదక్షిణ చేస్తున్న నిర్వాహకులు

వరదయ్యపాళెం, జూలై 22: వరదయ్యపాళెంలోని అరుదూరు మార్గంలో కొలువైన కస్తూరప్పస్వామి ఆలయ మహాకుంభాభిషేకం గత మూడు రోజులుగా వేడుకగా నిర్వహిస్తున్నారు. వరదయ్యపాళెం హరిజనవాడ గ్రామస్తుల కులదైవమైన కస్తూరప్పస్వామికి సోమవారం పొంగళ్లు పెట్టారు. అనంతరం మూడురోజుల పాటు పూజలు నిర్వహించిన 108 కలశాలతో ఆలయ గోపురం శిఖర కలశానికి అభిషేకం చేసి మహాకుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బొప్పన తిలక్, బొప్పన మోహన మురళి, రమేష్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం



శ్రీకాళహస్తి, జూలై 22: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలిసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజావరోహణంతో ముగిశాయి. ఆలయ ధ్వజస్తంభానికి కట్టిన చీరలను ఆచారం ప్రకారం కిందకు దింపారు. అంతకుముందు ఉదయం ద్రౌపదీదేవి అమ్మవారు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

జగన్ శవ రాజకీయాలను మానుకోవాలి: టీడీపీ

శ్రీకాళహస్తి, జూలై 22: మాజీ ముఖ్యమంత్రి జగన్ శవ రాజకీయాలను మానుకోవాలని టీడీపీ బీసీ సెల్ నాయకులు హితవు పలికారు. సోమవారం వారు మాట్లాడుతూ అసత్య ప్రచారాలు చేయడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో బాధితులనే నిందితులుగా చేసి ప్రభుత్వ టెర్రరిజానికి పాల్పడ్డారని, ఐదేళ్ల పాటు అరాచక పాలన సాగించిన జగన్ అధికారం కోల్పోగానే నీతులు చెప్పడం విడూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్‌కు దమ్ముంటే తన బాబాయ్ హత్యకేసు సత్వర పరిష్కారం కోసం ధర్నా చేయాలన్నారు. గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతిని ఎన్డీఏ ప్రభుత్వం బయటపెడుతుండడంతో ఆ పార్టీ నాయకుల్లో వణుకు పుడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు మిన్నల రవి, ఉమేష్‌రావు, నెమళ్లూరు బుజ్జి, కోట చంద్రశేఖర్, మునిరాజ యాదవ్, సునీల్, శివ, మైనార్టీ నాయకులు సయ్యద్ చాంద్‌బాషా, సులేమాన్, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటుపై గిరిజనుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనుల నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 22: మండలంలోని కంచనపుత్తూరు గ్రామంలోని గిరిజనులు 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంచనపుత్తూరు గ్రామానికి చెందిన 15 మంది గిరిజన కుటుంబాలకు సర్వే నెంబర్లు 460, 461, 462, 463, 464, 465లో 14 ఎకరాలు 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిందన్నారు. అప్పటి నుంచి భూమిని సాగు చేసుకుంటున్నామని చెప్పారు. మూడు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు తాము సాగు చేస్తున్న భూముల్లో భూముల్లో ఎవ్వరూ ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. బోర్డును తొలగించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని గిరిజనులు వాపోయారు. అనంతరం తహసీల్దార్ ఆలీఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఆడికృత్తిక పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈవో తదితరులు

శ్రీకాళహస్తి, జూలై 22: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఈ నెల 29న ఆడికృత్తిక జరగనుంది. సోమవారం ఆలయంలోని గురుదక్షిణా మూర్తి సన్నిధిలో విశేష పూజల అనంతరం ఆడికృత్తిక పోస్టర్లను ఈవో ఎస్వీఎస్ఎన్‌మూర్తి ఆవిష్కరించారు. ఆడికృత్తిక ఉత్సవాలకు 24వ తేదీ అంకురార్పణ చేస్తారు. 25న ధ్వజారోహణం, 29న ఆడికృత్తిక, 30న రథోత్సవం, 31న కల్యాణోత్సవం, ఆగస్టు 1న పార్వేట ఉత్సవం, 2న ధ్వజావరోహణం, 3న పల్లకీసేవ జరగనుంది. కార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, మల్లికార్జున ప్రసాద్, లోకేష్‌రెడ్డి, సుదర్శన్, నాగభూషణం యాదవ్, లక్ష్మయ్య, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

యూడైస్ స్పెషల్ డ్రైవ్‌ను పూర్తి చేయండి

పిచ్చాటూరు, జూలై 22: పిచ్చాటూరులోని ఎమ్మార్సీని జిల్లా సెక్టోరల్ అధికారుల బృందం సోమవారం సందర్శించింది. మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో యూడైస్ ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ పురోగతిని సమీక్షించారు. యూడైస్ స్పెషల్ డ్రైవ్‌ను కచ్చితంగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో గోపాల్‌రెడ్డి, డీఎస్‌వో సారథి, ఏఎంవో మధుసూదన రెడ్డి, ఏసీఎంవో శ్రీరామ్, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మృత్యుంజయస్వామికి పూజలు

శ్రీకాళహస్తి, జూలై 22: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామి వారికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ
ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మృతి చెందిన మహేష్

ఏర్పేడు, జూలై 22: ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన సోమవారం ఏర్పేడు మండలంలో చోటుచేసుకుంది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... పల్లం గ్రామానికి చెందిన వెంకటరత్నం పశువుల ఎరువును ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని పొలంలో చల్లడానికి బయల్దేరాడు. పల్లం - శ్రీకాళహస్తి రోడ్డు మార్గంలో వెళుతుండగా ట్రాక్టర్ వెనుక భాగాన్ని ఓ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో డ్రైవర్ వెనక కూర్చుని ప్రయాణిస్తున్న కూలీలు మహేష్(33), వెంకటేష్(32) కింద పడ్డారు. మహేష్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మహేష్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, జూలై 22: శ్రీకాళహస్తి మండలం ఓబులాయపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులు(45) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తి పట్టణానికి బయలుదేరాడు. మండలంలోని అక్కుర్తి వద్ద వెళుతుండగా వెనుక వైపు నుంచి ఓ ట్రాక్టర్ ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసులును స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాలికి తీవ్రగాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్
ఒకరికి తీవ్రగాయాలు

కేవీబీపురం, జూలై 22: మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద ఉన్న గ్యాస్ గోదాము సమీపంలో ద్విచక్ర వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. తొట్టంబేడు మండలం రామంలింగాపురం గిరిజనకాలనీకి చెందిన మీరయ్య(35) కేవీబీపురం మండలం నుంచి శ్రీకాళహస్తి వైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా కొత్తూరు గ్యాస్ గోదాము వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. మీరయ్యకు తలకు బలమైన గాయాలయ్యాయి. అతనిని స్థానికులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తీసుకెళ్లినట్లు వైద్యులు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించండి

కేవీబీపురం, జూలై 22: మండలంలోని కోటమంగాపురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నీలమేఘం ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని గ్రామస్తులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో రెడ్డెయ్య, ఏపీఎం కుమారస్వామి గ్రామంలో విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడ్డాడని, అతనిని తొలగించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. పీడీకి నివేదిక అందించి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.

మొక్కు చెల్లింపు

శ్రీకాళహస్తి, జూలై 22: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి విజయం సాధించిన నేపథ్యంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ తిరుమల శ్రీవారికి సోమవారం మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళా ప్రదర్శన

తారకరామనగర్, జూలై 22: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీ) ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై మహిళా సంఘ సభ్యులకు వీధినాటకం కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. డీసీసీబీ మేనేజరు జి.పార్వతి మాట్లాడుతూ వ్యక్తిగత, డ్వాక్రా రుణాలు, బీమా తదితర అంశాల గురించి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో రేణిగుంట డీసీసీబీ బ్రాంచ్ సిబ్బంది సురేష్‌బాబు, రమేష్, మోహనయ్య, ప్రకాష్, సత్యకృష్ణ వీధి నాటక బృందం, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, జూలై 22: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ షోబెలెడు షిడోకేస్ కరాటే పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. కరాటే మాస్టర్ సంపత్‌కుమార్ నేతృత్వంలో కరాటే పోటీల్లో పాల్గొన్న జశ్వంత్‌యాదవ్, నిఖిత, కిరణ్‌కుమార్, క్రాంతి కుమార్, జ్యోతీశ్వర్, అక్షయ, దీక్షిత, శ్రీశాంత్, మాధుర్యశ్రీ, చాతుర్యశ్రీ మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

పుత్తూరు వార్తలు

మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు కేటాయించండి



మంత్రి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 22: నగరి, పుత్తూరు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం అమరావతిలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు నిధుల అవసరం ఉందన్నారు. వీటన్నింటినీ సావధానంగా విన్న మంత్రి నారాయణ నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

వడమాలపేట, జూలై 22: మండలంలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు మొబైల్ ఆధార్ కేంద్రాలను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సుజాతమ్మ చెప్పారు. ఈ నెల 23న ఎస్‌బీఆర్ పురం, ఏఎంపురం, 24న బాలినాయుడు కండ్రిగ, అప్పలాయగుంట, 25న పాదిరేడు, పత్తిపుత్తూరు, 26న పూడి, వడమాలపేట, 27న వడమాలపేట, ఎస్వీపురం గ్రామాల్లో ఆధార్ తాత్కాలిక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

శోభాయమానంగా ప్రసన్న వెంకటేశ్వరుడి పుష్పయాగం



వడమాలపేట, జూలై 22: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పుష్పయాగం శోభాయమానంగా జరిగింది. ఆలయంలో గత నెల 17నుంచి 25 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం విదితమే. బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారికలు, అధికారులు, భక్తుల వల్ల తెలిసీ తెలియక లోపాలు జరిగి ఉంటే ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తులసి, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి రోజా, కలువలు వంటి 11 రకాల పుష్పాలు ఐదు రకాల పత్రాలతో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మహామంగళ హారతులిచ్చారు. అనంతరం పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల అందజేత



ఎస్ఐ ధర్మారెడ్డికి చిత్రపటాలను అందజేస్తున్న ధనంజయులు నాయుడు

వడమాలపేట, జూలై 22: వడమాలపేటలోని తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరి నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మునిశేఖర్, వడమాలపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు ఢిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.